సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



ఆర్వో కేంద్రాలు సిద్ధం

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. దీనికి సంబంధించి ఆర్వో కేంద్రాలను సిద్ధం చేశారు.

- IIలో ▸



ఫ్లాగ్‌మార్చ్

జిల్లా కేంద్రంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో గురువారం కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /19.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరగవచ్చు, రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అక్రమ మద్యంపై సమాచారమివ్వండి

ఖలీల్‌వాడి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం సరఫరా చేస్తున్న సమాచారం తెలిస్తే ఎక్సైజ్ కమిషనర్ హైదరాబాద్ కార్యాలయం టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523కు తెలియజేయవచ్చని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సైజ్‌శాఖ 'వీరిట్' (verit) అప్లికేషన్ ద్వారా అక్రమ మద్యం ఆనవాళ్లను గుర్తిస్తున్నామన్నారు. ప్రతి లిక్కర్ బాటిల్ పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే మద్యం తయారీ ప్రదేశం, ఏ డిపోకు చెందినదనే పూర్తి సమాచారం తెలుస్తాయన్నారు.

అబ్జర్వర్ల నియామకం

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు సాధారణ, పోలీస్ అబ్జర్వర్లను గురువారం నియమించింది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీస్ అబ్జర్వర్‌గా ఐపీఎస్ అధికారి రితురాజ్ నియమితులయ్యారు. అలాగే రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకరు చొప్పున ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పర్యవేక్షణకు ఐపీఎస్ అధికారులను జనరల్ అబ్జర్వర్‌గా నియమించారు. ఆర్మూర్, బాల్కొండకు సుబ్ర చక్రబర్తి, బోధన్, బాన్సువాడకు లలిత్ నారాయణ్ సింగ్ సందు, రూరల్, అర్బన్‌కు శ్రీకాంత్ ప్రస్టీ నియమితులయ్యారు. నేడు నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూం



సుభాష్‌నగర్ : జిల్లాలో వానాకాలం 2023–24 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం సేకరణలో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను గురువారం అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 421 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరికొన్ని చోట్ల ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా కంట్రోల్ రూం 08462-293087, 81422-00200, 99082-76004కు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో డీసీవో సింహాచలం, డీఎస్‌వో చంద్రప్రకాష్, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జగదీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి ప్రశాంత్ రెడ్డి



పథకాలు ఇవీ..

ఓటు నిర్ణయం మీదే!

- వేల్పూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- రూ. రెండువేల పింఛన్ నా నిర్ణయమే..
- పింఛన్ రూ. 5 వేలకు, రైతు బంధు రూ.12 వేలకు పెంచుతాం..
- కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు చేసిందేమీ లేదు..

తమ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన పథకాలను సీఎం కేసీఆర్ వివరించారు. కొత్తగా పెంచబోయే పింఛన్‌లు, రైతుబంధు సాయం, బీమా పథకాలపై హామీ ఇచ్చారు. ఇక ఓటు నిర్ణయం మీదేనని ప్రజలకు వదిలివేశారు. బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ శివారులోని స్పైసిస్ పార్క్ ప్రాంగణంలో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం అరగంటసేపు ప్రసంగించారు. **– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్, మోర్తాడ్**



వేల్పూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో మేనిఫెస్టో తయారు చేసేటప్పుడు పింఛన్ల విషయంలో తీవ్ర చర్చ జరిగింది. గత ప్రభుత్వాలు రూ.70, రూ.200 ఇస్తే తెలంగాణ ఆవిర్భావం తరువాత రూ.500 ఇవ్వాలని కొందరు మేధావులు సూచించారు. అయితే పెరిగిన ధరలతో పోల్చితే ఇంత తక్కువ మొత్తం సరిపోతాయా అని భావించి తానే స్వయంగా రూ.వెయ్యి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు బాగుపడటంతో పింఛన్‌ను రూ.2 వేలకు పెంచామన్నారు. ఇక నుంచి సంవత్సరానికి కొంత పెంచుతూ పింఛన్‌ను రూ.5 వేల వరకు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. రైతుబంధు పథకాన్ని కూడా రూ.12 వేలకు పెంచబోతున్నామన్నారు.

ఎన్నికల తీరుపై ఆవేదన..

స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడచినా ప్రజాస్వామ్యం పరిణతి చెందలేదని, ఎన్నికలు అంటేనే అబద్ధాలు వల్లించడం, దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని ఆరాటపడటం జరుగుతోందని ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో టీవీల్లో ప్రసంగాలు ఇచ్చి ప్రచారం చేస్తున్నారని, అక్కడ సభలను కేవలం 6 వేల మంది ప్రజలతోనే సరిపెడతారన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. బీఆర్‌ఎస్ వచ్చిన తరువాత ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయో ప్రజలు గుర్తించాలన్నారు. ఓటు వేసే ముందు ఏ పార్టీ అభ్యర్థి మేలు, అభ్యర్థికంటే ఆయన వెనుక ఉన్న పార్టీ ఎలాంటిదో గుర్తించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మా సుట్టపోడు చెప్పిండనో, లేక దోస్తులు చెప్పిండ్రనో విని చెడిపోకుండా మంచి ఆలోచన చేసి ఓట్లు వేయాలన్నారు.

రైతులపై కాల్పుల చరిత్ర వారిది...

ఎర్రజొన్న రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ప్రతిపక్ష పార్టీదని పరోక్షంగా కాంగ్రెస్‌ను సీఎం ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాతనే రూ.15 కోట్ల వరకు బకాయిలు చెల్లించామన్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఇప్పటికీ రైతులు ఎరువుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఉందన్నారు. తెలంగాణలో అలాంటి దుస్థితి ఎప్పుడో దూరమైందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసి పది రోజుల్లో డబ్బులు జమ చేసే ప్రభుత్వం తమదే అన్నారు. ఇప్పటి వరకు రూ. 3 కోట్ల టన్నుల ధాన్యం పండుతోందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తయితే 4 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగబోతుందని అన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించి...

గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ఎన్నో పైరవీలు చేసేవారని, ఇప్పుడు ఏ పైరవీలు లేకుండానే సబ్ స్టేషన్‌లను మంజూరు చేస్తున్నామని సీఎం తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో 18 సబ్ స్టేషన్‌లను మంజూరు చేశామని, ఇంకా కొత్తవి ఎన్నికల తరువాత పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



సభలో పాటకు నృత్యం చేస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మోతెను మురిపించిన సీఎం..

వేల్పూర్ మండలం మోతె గ్రామంతో తనకు, తెలంగాణ ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని సీఎం మరోసారి గుర్తు చేసుకున్నారు. ప్రసంగం ఆరంభంలోనే మోతె పేరును ప్రస్తావించి ఉద్యమ సమయంలో మోతె తనవెన్నంటి నడిచిందని, మోతె మట్టిని ముడుపుకట్టి హైదరాబాద్ తీసుకు వెళ్లానని సీఎం చెప్పారు. మోతె మట్టికి అంతటి శక్తి ఉందని తెలంగాణ ఆవిర్భావం తరువాత ఆ మట్టిని తీసుకువచ్చి మళ్లీ ఇక్కడే కలిపామని చెప్పారు. మోతె పేరును సీఎం ప్రజా ఆశీర్వాద సభలో హోరెత్తించడం విశేషం.

ప్రశాంత్‌రెడ్డికి మరోమారు..

ప్రశాంత్ రెడ్డి తనకు కొడుకులాంటి వాడని, ఎన్నికలయ్యాక ఏర్పడే కొత్త ప్రభుత్వంలోనూ ప్రశాంత్‌రెడ్డి అదే పెద్ద మనిషి హోదాలో ఉంటాడని సభాముఖంగా సీఎం కేసీఆర్ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

నియోజకవర్గ సమస్యలు తీర్చండి



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గ సమస్యలు తీర్చాలని వేల్పూర్ స్పైస్‌పార్కులో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డి విన్నవించారు. లింబాద్రిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి మరిన్ని నిధులు అవసరమని, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి సిమెంట్ పైప్‌లైన్ ఉందని, దాని స్థానంలో స్టీల్ పైప్‌లైను, వేల్పూర్ మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. ఎస్సారెస్పీ చుట్టు పక్కల టూరిజంను అభివృద్ధి చేయాలని, బాల్కొండను మున్సిపాలిటీగా మార్చాలని కోరారు. నియోజకవర్గంలో రహత్‌నగర్, వాడి కొత్తపల్లి, బస్సాపూర్ గ్రామాల్లో విద్యుత్తు సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయాలన్నారు. మరో 5వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి ద్వారా మరో 3వేల ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కొత్తగా పీఎఫ్ నంబర్లు పొందిన బీడీ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. వచ్చే ప్రభుత్వంలో ప్రశాంత్‌రెడ్డి చెప్పిన పనులన్నీ పూర్తవుతాయని సీఎం కేసీఆర్ ఆయన ప్రసంగంలో పేర్కొన్నారు.

బీజేపీలో మరో ముగ్గురికి..

- బాన్సువాడ టికెట్ యెండల లక్ష్మీనారాయణకు..
- బోధన్ సీటు వడ్డి మోహన్‌రెడ్డికి ఖరారు
- రూరల్ కులాచారి దినేష్‌కు కేటాయింపు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ గురువారం అసెంబ్లీ అభ్యర్థులతో మరో జాబితా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇప్పటిదాకా మొదటి విడతలో ఐదుగురు అభ్యర్థులను ఖరారు చేయగా తాజాగా మరో ముగ్గురు అభ్యర్థులను ప్రకటించింది.

బాన్సువాడ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బోధన్ సీటును వడ్డి మోహన్‌రెడ్డికి కేటాయించింది. నిజామాబాద్ రూరల్ స్థానాన్ని కులాచారి దినేష్‌కు ఫైనల్ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎల్లారెడ్డి సీటు విషయంలో మాత్రం పెండింగ్‌లో పడింది.

బాన్సువాడ



అభ్యర్థి పేరు : యెండల లక్ష్మీనారాయణ
పుట్టిన తేదీ : మార్చి 1, 1963
వయస్సు : 60
విద్యార్హత : బీఏ(ఎల్‌ఎల్‌బీ)
తల్లిదండ్రులు : బుచ్చమ్మ, యెండల చిన్నయ్య (మాజీ మున్సిపల్ కౌన్సిలర్)
: భార్య, ఇద్దరు పిల్లలు

రాజకీయ ప్రస్థానం:

- ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ కార్యకర్త. 1980లో బీజేపీలో సభ్యత్వం.
- పట్టణ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడిగా విధులు.
- 1998లో సింగూరు జలాల కోసం రైతు నిరవధిక దీక్షలో భాగంగా లాఠీచార్జీలో తీవ్ర గాయాలు.
- 1999 అర్బన్‌లో డీఎస్ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి
- 2001లో ఉమ్మడి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నిక.
- 2007 నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు.
- 2009లో అర్బన్ ఎమ్మెల్యేగా డీఎస్‌పై గెలుపు
- 2009లో తెలంగాణ ఉద్యమంలో ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా.
- 2010లో ఉపఎన్నికల్లో తిరిగి డీఎస్‌పై విజయం.
- 2014 ఎంపీగా పోటీచేసి ఓటమి.
- 2014 - 2020 కోర్ కమిటీ సభ్యుడిగా విధులు
- 2018లో ముత్యంపేట నుండి బోధన్ వరకు నిజాంషుగర్స్ పునఃప్రారంభించాలని పాదయాత్ర
- 2018లో అర్బన్ ఎమ్మెల్యేగా పోటీ, ఓటమి. 2020 నుంచి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విధులు.

బోధన్



అభ్యర్థి పేరు : వడ్డి మోహన్‌రెడ్డి
వయస్సు : 55
తల్లిదండ్రులు : ధనలక్ష్మి, వీరారెడ్డి
భార్య : లక్ష్మి
కుమారులు : ఆశిష్ రెడ్డి, ధీరజ్ రెడ్డి
గ్రామం : రెడ్డి ఫారం, జీపీ మోకన్‌పల్లి, నవీపేట మండలం
విద్యార్హత : బీకాం

రాజకీయ ప్రస్థానం:

- ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
- 1990–2018 వరకు టీడీపీ జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు
- 1995–2000 వరకు నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా..
- 2000–2005 వరకు సారంగాపూర్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్
- 2006–2011 నవీపేట జెడ్పీటీసీ సభ్యుడు, టీడీపీ జెడ్పీ ఫ్లోర్ లీడర్
- 2018–2022 బీఆర్‌ఎస్‌లో చేరిక
- 2022 ఆగస్టులో బీజేపీలో చేరారు.
- ప్రస్తుతం ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా..
- తెలంగాణ రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.
- నిజామాబాద్ గోశాల కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.
- జిల్లా కేంద్రంలోని రఘునాథ ఆలయం(ఖిల్లా), శ్రద్ధానంద్‌గంజ్ ఉమామహేశ్వర ఆలయ ట్రస్టీగా ఉన్నారు.

నిజామాబాద్ రూరల్



అభ్యర్థి పేరు : కులాచారి దినేశ్ కుమార్
పుట్టిన తేదీ : ఆగస్టు 31, 1972
వయస్సు : 51
విద్యార్హత : సివిల్ ల్యాబ్ టెక్నీషియన్
తల్లీతండ్రి : అనసూయ, మధుసూదన్‌రావు
భార్య : దివ్య
కుమారులు : కిరణ్, ఉదయ్
గ్రామం : అమృతాపూర్, డిచ్‌పల్లి మండలం

రాజకీయ ప్రస్థానం:

- తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి రాక
- విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, యువజన విభాగం రాష్ట్ర కోశాధికారి, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
- తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు.
- తెలుగుదేశం పార్టీ నుంచి డిచ్‌పల్లి జెడ్పీటీసీగా గెలుపొందారు.
- జిల్లా ప్రణాళిక సంఘం సభ్యుడిగా ఉన్నారు.
- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆయన భార్య దివ్య పనిచేశారు.
- డిచ్‌పల్లిలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు గెలుపులో కీలకపాత్ర పోషించారు.
- రూరల్ ఎమ్మెల్యేగా బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపులో రెండు సార్లు ప్రధాన భూమిక
- 2021 జనవరి 3న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో 10 మంది సర్పంచ్‌లు, 10 మంది ఎంపీటీసీలు, ఒక ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, మాజీ సర్పంచులతో బీజేపీలో చేరారు.

యువత కదలాలి.. ప్రతి గుండెనూ తట్టాలి

- బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఆ పార్టీల అభ్యర్థులు చేసిందేమీ లేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత





షకీల్‌ను గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్సీ కవిత, బీఆర్‌ఎస్ మహా యువ గర్జనకు హాజరైన కార్యకర్తలు

బోధన్ : తెలంగాణ ఉద్యమ సమయంలో యువత చూపిన అదే స్ఫూర్తితో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, ప్రతి ఇంటిని ప్రతి గుండెనూ తట్టాలని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. గురువారం రాత్రి బోధన్‌లోని ఎన్‌ఎస్‌ఎఫ్ మైదానంలో అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా యువగర్జన సభకు ఎమ్మెల్సీ కవిత హాజరై ప్రసంగించారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా యువత ప్రతిఇంటికీ వెళ్లాలని, కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ప్రతిపక్ష పార్టీల తీరును ఎండగట్టాలన్నారు. బోధన్ తన సొంత గడ్డ అని, ఇక్కడ గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను 50 వేల మెజారిటీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పెద్ద మనిషి సుదర్శన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి పోటీలో ఉన్నారని, ఇరువురు నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో భారీనీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి ఏమి చేయలేదని, ఆయన సొంత గ్రామానికి రూ. 15 కోట్లతో, మోహన్‌రెడ్డి సొంత గ్రామంలో రూ. 7 కోట్లతో ఎమ్మెల్యే షకీల్ అభివృద్ధి చేశారన్నారు. సుదర్శన్‌రెడ్డికి ఓటు వేస్తే ఏమీ ఉపయోగం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, డబ్బులు ఇవ్వజూపుతున్నాయన్నారు.

ఉద్యోగాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్

తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనలో 2 లక్షల 32 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీచేసి అందులో లక్షా 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసుకున్నామని, మరో 40 వేల ఉద్యోగాల భర్తీ ఆయా దశలో ఉన్నాయన్నారు. కాని కోర్టుల్లో కేసులు వేసి కాంగ్రెస్ నాయకులు నియామకాలను అడ్డుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే షకీల్ పేరులోనే సంపన్నుడు కాదని, మంచి మనసున్నసంపన్నుడన్నారు.

రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి

యువగర్జన సభలో ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ తొమ్మిన్నరేళ్ల కాలంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత చొరవతో నియోజకవర్గంలో రూ. 3 వేల కోట్ల అభివృద్ధి పనులు చేసుకున్నామని, మరో రూ. 1800 కోట్లు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా వారి ఖాతాల్లో నేరుగా జమయ్యాయన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, భవానిపేట శ్రీనివాస్, సురేష్, సతీష్ చారి, జుబేర్, రవి శంకర్ తదితరులున్నారు.

ముహూర్తం చూసుకుని..

- నామినేషన్ల దాఖలుకు సిద్ధమైన అభ్యర్థులు
- ఇంకా ముహూర్తం ఖరారు చేసుకోని కొందరు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కీలకమైన నామినేషన్ల ఘట్టం షురూ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సంబంధించి తగిన ముహూర్తం చూసుకుని దానికనుగుణంగా సిద్ధమవుతున్నారు. కొందరు అభ్యర్థులు ఇంకా ముహూర్తం ఖరారు చేసుకోలేదు. మరికొన్ని చోట్ల ఇప్పటికీ అభ్యర్థులు ఖరారే కాలేదు. కాగా బాన్సువాడ నుంచి బరిలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఈనెల 4న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ 8న నామినేషన్ వేయనున్నారు.

రూరల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి ఈ నెల 9న నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఈ నెల 9న, అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ఈ నెల 8న, బీఆర్‌ఎస్ అభ్యర్థి గణేష్‌గుప్తా 9న నామినేషన్లు వేయనున్నారు. బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఈనెల 6న, బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ ఈనెల 8న నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

నేడు ఆర్మూర్‌లో సీఎం సభ



ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ రోడ్డులో నేటి ప్రజా ఆశీర్వాద యాత్రకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నందున బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేస్తున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఖైసర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ టోర్నీ

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న రాజారాం స్టేడియంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఖైసర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్‌, ఫుట్‌బాల్‌ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ చైర్మన్‌ సయ్యద్‌ఖైసర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు అథ్లెటిక్స్‌, ఫుట్‌బాల్‌ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌, కరీంనగర్‌, కామారెడ్డి, నిజామాబాద్‌, పలు జిల్లాల క్రీడాకారులు ఇప్పటికే స్టేడియానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. టోర్నీలో గెలుపొందిన వారికి బహుమతులు, మెడల్స్‌ అందజేయనున్నట్లు తెలిపారు.

సత్తాచాటిన క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం:ఇటీవల నిర్వహించిన రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అభ్యాస స్కూల్‌ విద్యార్థులు సత్తాచారు. క్రీడాకారులను స్కూల్‌ డైరెక్టర్‌ పి శ్రీనివాస్‌, ప్రిన్సిపాల్‌ మాధవి, ఇన్‌చార్జి రవి,పీఈటీ ఆకుల నాగరాజు గురువారం అభినందించారు.రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో జునార్జై అనుమల్‌, చెస్‌లో సుజన్‌కుమార్‌, రోషిణి, నాగజోష్నిక, వైభవ్‌శర్మ, జాతీయస్థాయి ఫుట్‌బాల్‌లో సాయిమీనాక్షి గెలుపొంది పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి యోగాలో చాంపియన్‌షిప్‌ కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

నేడు ఎస్‌ఈఏఎస్‌ పరీక్ష



నిజామాబాద్‌ అర్బన్‌ : జిల్లాలో స్టేట్‌ ఎడ్యుకేషన్‌ అచీవ్‌మెంట్‌ సర్వే(ఎస్‌ఈఏఎస్‌) పరీక్ష గురువారం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యా ప్రమాణాలు నైపుణ్యాలు భాష, గణిత, చిత్రలేఖన తదితర అంశాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షను జిల్లావ్యాప్తంగా అన్ని విభాగాల్లో 760 స్కూళ్లను ఎంపిక చేశారు. 1,137 పరీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 29,163 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మూడు, ఆరో తరగతి విద్యార్థులకు భాషకు సంబంధించి గణితంలో 20 ప్రశ్నలుంటాయి. అదేవిధంగా 9వ తరగతి విద్యార్థులకు 31 ప్రశ్నలు అడుగుతారు.

ఓట్ల నమోదుకు 25,133 దరఖాస్తులు

సుభాష్‌నగర్‌ : 18ఏళ్లు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం కొత్త ఓట్ల నమోదుకు అక్టోబర్‌ 4 నుంచి 31 వరకు అవకాశమివ్వగా, 25,133 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబర్‌ 4న ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మరోమారు అవకాశమిచ్చింది. ఆర్మూర్‌లో 3469, బోధన్‌లో 3443, బాన్సువాడలో 2162, నిజామాబాద్‌ అర్బన్‌ లో 6500, నిజామాబాద్‌ రూరల్‌లో 4381, బాల్కొండలో 5178 మంది కొత్తగా ఓటు కో సం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీ వరకూ పరిశీలించి అర్హులై న వారి ఓట్లను తుది జాబితాకు అనుసంధానం చేస్తారు.

అభ్యర్థి ఎవరైనా ప్రచారంలో వారే..

- ర్యాలీలు, ప్రచారాలకు తరలివస్తున్న మహిళా సంఘాల సభ్యులు
- బైకు ర్యాలీల్లో యువకులు
- ఓటరు నాడి తెలవక తలలు పట్టుకుంటున్న నాయకులు

ఆర్మూర్‌: బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ.. ఏ పార్టీ ర్యాలీ నిర్వహించినా.. ప్రచారం నిర్వహించినా అధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, కుల సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు హాజరై ఆ ర్యాలీలను విజయవంతం చేస్తున్నారు. అయితే ఏ పార్టీ, అభ్యర్థి ఎవరు అన్న ప్రశ్న లేకుండా అన్ని పార్టీల ప్రచార కార్యక్రమాల్లో వీరే పాల్గొంటుండడంతో ఓటరు నాడి అర్థం కాక రాజకీయ పార్టీల నాయకులు, విశ్లేషకులు తలలు పట్టుకుంటున్నారు. పార్టీ ఏదైనా ఆయా పార్టీల నాయకులు ఇస్తున్న డబ్బుల కోసం మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం తమ బల నిరూపణ చేసుకోవడం కోసం ప్రచార కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువజన సంఘాల సభ్యులను తరలిస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ. రెండు వందల నుంచి..

ప్రచార కార్యక్రమాలకు హాజరయ్యే మహిళలకు రోజుకు రూ. రెండు వందల నుంచి రూ. మూడు వందల వరకు చెల్లిస్తున్నట్లు డబ్బులు పంపిణీ చేస్తున్న నాయకులే బహిరంగంగా సమాచారం ఇస్తున్నారు. ఇక మోటార్‌ సైకిల్‌ ర్యాలీల్లో పాల్గొనడానికి వస్తున్న యువతకు ఒక్కో మోటార్‌ సైకిల్‌కు రూ. ఐదు వందలు, కారుకు రూ. 15 వందలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళలు, యువకులు, కుల సంఘాల సభ్యులు ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారో, లేదో అర్థం కాని పరిస్థితుల్లో పెద్ద ఎత్తున జన సమీకరణతో ప్రత్యర్థులకు దడ పుట్టించాలని తద్వారా తాము గెలుస్తున్నామన్న టాక్‌ను సృష్టించాలని వివిధ పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు పోటీ పడి మరీ ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది.



అన్ని నియోజకవర్గాల్లో..

ప్రచారానికి ఈ జన సమీకరణ చేసే విధానం కేవలం ఆర్మూర్‌ నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కొనసాగుతోంది. అయితే అన్ని పార్టీల ప్రచారానికి వారే రావడాన్ని గుర్తించిన స్థానిక ప్రజలు ప్రత్యేకంగా ఈ వ్యవహారంపై చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, తమ పార్టీల మేనిఫెస్టోలతో పాటు భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి చేయాలనుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తే సరిపోయేదానికి ఇలా పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి ర్యాలీల ద్వారా ప్రచారం నిర్వహించడం వల్ల అబాసు పాలు కావడం తప్ప ఒరిగేదేమీ లేదని ప్రజలు, ఓటర్లు చర్చించుకుంటున్నారు.

ఆర్‌ఓ కేంద్రాలు సిద్ధం

- నేటి నుంచి నామినేషన్‌ పత్రాల స్వీకరణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 1549 పోలింగ్‌ కేంద్రాల ఏర్పాటు

సుభాష్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికలు–2023 నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేయనుంది. ఇప్పటికే షెడ్యూల్‌ ప్రకటించిన విషయం తెలిసిందే. నోటిఫికేషన్‌ వెలువడిన వెంటనే అభ్యర్థుల నుంచి నియోజకవర్గాల్లోని రిటర్నింగ్‌ అధికారి కార్యాలయాల్లో నామినేషన్‌ పత్రాలను స్వీకరించనున్నారు. ఈ మేరకు నామినేషన్‌ స్వీకరణ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు..

శాసనసభా ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి పరిధిలో నిజామాబాద్‌ రూరల్‌, నిజామాబాద్‌ అర్బన్‌, బాల్కొండ, ఆర్మూర్‌, బోధన్‌, బాన్సువాడ నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో మొత్తం 1549 పోలింగ్‌ కేంద్రాలు ఉన్నాయి.

- షెడ్యూల్‌ వెలువడక ముందు నుంచే ఓటర్ల నమోదు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఫస్ట్‌ లెవల్‌ ఈవీఎంల పరిశీలన, తదితర ఏర్పాట్లు చేశారు.
- పోలింగ్‌ కేంద్రాల ఏర్పాట్లు, పరిశీలన, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల గుర్తింపు, మోడల్‌, మహిళా, వికలాంగ సిబ్బంది నిర్వహించే పోలింగ్‌ కేంద్రాలను సిద్ధం చేశారు.
- సరిహద్దుల్లో అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. జిల్లావ్యాప్తంగా కేంద్ర బలగాలు, పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు, రెవెన్యూ, వాణిజ్యపన్నులశాఖ, పోలీసులతో తనిఖీ బృందాలు నియమించారు. నగదు, బంగారం తరలింపుపై నిఘా పెంచారు. గ్రీవెన్స్‌ కమిటీని ఏర్పాటుచేశారు.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిటర్నింగ్‌ అధికారులు, అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ అధికారులను నియమించారు. నోడల్‌ ఆఫీసర్లు, ప్రిసైడింగ్‌, సెక్టోరల్‌ అధికారులను నియమించి శిక్షణను పూర్తి చేశారు.
- ఆరు నియోజకవర్గాల్లో 13,65,811 ఓటర్లతో తుది జాబితా ఎన్నికల సంఘం విడుదల చేసింది.
- ఇప్పటికే ఫస్ట్‌ లెవల్‌ చెకింగ్‌ పూర్తి కాగా, నామినేషన్లు పూర్తయ్యాక రెండో లెవల్‌, పోలింగ్‌కు ముందు రోజు మూడో లెవల్‌ చెకింగ్‌ చేయనున్నారు.
- సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మొదటి ర్యాండమైజేషన్‌ ప్రక్రియను పూర్తిచేశారు. రెండో విడత ర్యాండమైజేషన్‌ అభ్యర్థుల సమక్షంలో చేపట్టనున్నారు.
- పోలింగ్‌ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్‌, సహాయ ప్రిసైడింగ్‌ అధికారులను ర్యాండమైజేషన్‌ ద్వారా కేటాయించారు. వీరికి మాస్టర్‌ ట్రైనర్ల ద్వారా పోలింగ్‌ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మలి విడత శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు.
- నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలను తరలించి స్ట్రాంగ్‌ రూమ్‌లలో భద్రపర్చారు. బ్యాలెట్‌ యూనిట్లు, కంట్రోల్‌ యూనిట్లు పోలింగ్‌ కేంద్రాల కంటే 25శాతం అదనంగా, వీవీ ప్యాట్లు 40శాతం అదనంగా తరలించారు. పోలింగ్‌ రోజు ఉదయం 6 గంటలకు మాక్‌ పోలింగ్‌ ఏజెంట్ల సమక్షంలో చేపట్టనున్నారు.
- ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్‌ కళాశాలలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు.
- పోలింగ్‌ సక్రమంగా జరిగేలా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నారు.

నామినేషన్‌ స్వీకరణ కేంద్రాలు..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో రిటర్నింగ్‌ అధికారులు ఆయా కేంద్రాల్లో నామినేషన్‌ పత్రాలు స్వీకరిస్తారు. నేటి నుంచి 10వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. నామినేషన్‌ స్వీకరణ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమల్లో ఉంటుంది.

నామినేషన్‌ స్వీకరించే కేంద్రాలు

నియోజకవర్గం	రిటర్నింగ్‌ అధికారి పేరు	నామినేషన్‌ స్వీకరణ కేంద్రం
ఆర్మూర్‌	టి వినోద్‌కుమార్‌	ఆర్డీవో కార్యాలయం
బోధన్‌	రాజాగౌడ్‌	ఆర్డీవో కార్యాలయం
బాన్సువాడ	భుజంగ రావు	ఆర్డీవో కార్యాలయం
నిజామాబాద్‌ అర్బన్‌	మకంద్‌	మున్సిపల్‌ కార్యాలయం
నిజామాబాద్‌ రూరల్‌	రాజేంద్ర కుమార్‌	పాత కార్పొరేషన్‌ (ఆర్డీవో) కార్యాలయం
బాల్కొండ	చిత్రామిశ్రా	భీమ్‌గల్‌ ఎంపీడీవో కార్యా

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి



సిరికొండలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌

సిరికొండ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు సర్పల్లి తండా, కొండూర్‌, తాళ్లరామడుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఉన్న రైతులతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీవో సింహచలం ఉన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీసీవో సింహాచలం, సొసైటీ చైర్మన్‌ చిన్నారెడ్డి, సీఈవో సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సుభాష్‌నగర్‌: జిల్లాలోని టీఎన్‌జీవో, టీజీవో సంఘాలు సమన్వయంతో అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్‌, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌ పేర్కొన్నారు. నగరంలోని టీఎన్‌జీవో కార్యాలయంలో ఎంప్లాయిస్‌ జేఏసీ జిల్లా చైర్మన్‌ అలుక కిషన్‌, ఉమ్మడి జిల్లాల కన్వీనర్‌ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన టీఎన్‌జీవో, టీజీఓల విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులకు సమస్యలుంటే వెంటనే ఇరు సంఘాల దృష్టికి తీసుకురావాలని, సామరస్యంగా పరిష్కరించేందుకు ముందుంటామని తెలిపారు.అనంతరం టీజీవో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని కమిటీని సన్మానించి అభినందించారు. టీజీవో అధ్యక్షుడిగా సంగం అమృత్‌కుమార్‌, జిల్లా కార్యదర్శిగా హన్మంత్‌రెడ్డి, కోశాధికారిగా దేవీసింగ్‌, అసోసియేట్‌ అధ్యక్షుడిగా డాక్టర్‌ జలగం తిరుపతిరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్‌, సాయిరెడ్డి, జగన్‌, రాములు, నేతికుంట శేఖర్‌, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్‌, పూల శ్రీనివాస్‌, సతీశ్‌ కుమార్‌, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

గొంతులో సలాకా దిగి నరకయాతన

- సెప్టిక్‌ ట్యాంకు గుంతలో పడడంతో ప్రమాదం
- ఆపరేషన్‌ చేసి తొలగించిన వైద్యులు

కామారెడ్డి టౌన్‌: ప్రమాదవశాత్తూ మెట్లపైనుంచి జారి నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ ట్యాంకు గుంతలో పడడంతో ఓ కూలీ గొంతులో సలాకా గుచ్చుకుంది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన జనార్దన్‌ రోజూ జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌ చౌరస్తాలో ఉన్న కూలీల అడ్డా వద్దకు వచ్చి పని వెతుక్కుంటాడు. గురువారం ధరణి టౌన్‌షిప్‌లో భవన నిర్మాణ పనులకు కూలీగా వెళ్లాడు. పనులు చేస్తుండగా మెట్ల మీద నుంచి జారీ నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ ట్యాంక్‌ గుంతలో పడిపోయాడు. ఈ క్రమంలో అతని గొంతులో ఓ ఇనుప సలాకా దిగింది. దీంతో నరకయాతన అనుభవించాడు. దీనిని గమనించిన మేస్త్రీలు, కూలీలు కట్టర్‌తో సలాకాను కట్‌ చేసి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి సలాకాను తొలగించారు. ఇన్‌ఫెక్షన్‌ అయ్యే ప్రమాదం ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని గవర్నమెంట్‌ జనరల్‌ హాస్పిటల్‌కు పంపించారు.



పోలీసుల ఫ్లాగ్‌ మార్చ్‌




ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు గురువారం ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. నగరంలోని ఒకటి, రెండవ, నాలుగవ, ఆరవ పీఎస్‌ ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌ పాత కలెక్టరేట్‌ కార్యాలయం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్‌ చౌరస్తా, విజయ్‌ థియేటర్‌, ఎల్లమ్మ గుట్ట, ఎల్‌ఐసీ ఆఫీస్‌, పులాంగ్‌ చౌరస్తా, రాజరాజేంద్రచౌరస్తా, లక్ష్మీ మెడికల్‌, నెహ్రూ పార్క్‌ వరకు నిర్వహించారు. అంతేకాకుండా అర్సపల్లి కమాన్‌ తదితర ప్రాంతాల్లో చేపట్టారు. డీసీపీలు ఎస్‌ జయరాం, గిరి రాజు, జితేందర్‌ నదావత్‌, ఏసీపీ కిరణ్‌కుమార్‌, సీఐలు, ఎస్సైలు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

రూ. 2 కోట్లకుపైగా నగదు రిలీజ్‌

సుభాష్‌నగర్‌ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మోడల్‌ కోడ్‌లో భాగంగా పోలీస్‌, ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. దీంట్లో భాగంగా ఇప్పటివరకు 102 కేసులు నమోదు చేసి రూ. 3,92,45,330ల ఆధారాలు చూపని నగదు, బంగారు, వెండి ఆభరణాలు సీజ్‌ చేశారు. జిల్లా గ్రీవెన్స్‌ కమిటీ విచారణ నిమిత్తం 83 కేసులకు సంబంధించి రూ.2,18,03,178 నగదును రిలీజ్‌ చేశారు. రెండు కేసులకు సంబంధించి రూ. 1,04,85,500 నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించారు. మరో రెండు కేసులకు సంబంధించి రూ. 33,74,605 నగదును ఆదాయ పన్నుశాఖకు సిఫార్సు చేశారు. అలాగే 15 కేసుల సంబంధించి రూ.35,82,047 నగదుపై విచారణ చేపట్టాల్సి ఉందని పోలీసులు తెలిపారు.


వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



మహేశ్‌ (ఫైల్‌)

వర్ని: మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన బాదావత్‌ మహేశ్‌(22) ఆదిలాబాద్‌ జిల్లా నేరేడుగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చెందిన మహేశ్‌, రాజేశ్‌లు నేరేడుకొండలో ట్రాక్టర్‌ డ్రైవర్‌, క్లీనర్‌గా పనిచేస్తున్నారు. రాత్రి నేరేడుకొండ సమీపంలో బైక్‌ ఎదురుగా వస్తున్న బస్సు వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో మహేశ్‌ అక్కడికక్కడే మృతి చెందగా రాజేశ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



గంగాధర్‌(ఫైల్‌)

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌ స్పెషల్‌ టీం 2లో పనిచేస్తున్న కార్మికుడు రంజిత్‌ అలియాస్‌ గంగాధర్‌ డిచ్‌పల్లి మండలంలోని గొల్లపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్‌ తెలిపారు. ముబారక్‌నగర్‌కు చెందిన గంగాధర్‌ మూడేళ్లుగా మున్సిపల్‌ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

డెంగీతో ఆఫీస్‌ సబార్డినేట్‌..

నిజామాబాద్‌ రూరల్‌: డెంగీతో రూరల్‌ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జగన్‌ (29) మృతి చెందినట్లు ఎంపీడీవో మల్లేశ్‌ గురువారం తెలిపారు. గత రెండేళ్లుగా కార్యాలయంలో విధులు నిర్వరిస్తున్న జగన్‌ మూడు రోజుల క్రితం డెంగీతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆరోగ్యం పూర్తిగా క్షిణించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్యాలయ సిబ్బంది, అధికారులు జగన్‌ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రైం కార్నర్‌

ఏటీఎంలలో చోరీకి యత్నం

సదాశివనగర్‌: మండల కేంద్రంలోని కో–ఆపరేటీవ్‌ బ్యాంక్‌, ప్రైవేట్‌ బ్యాంక్‌ ఏటీఎంలో ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా చోరీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులు మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన వారుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

ఎత్తొండలో..

రుద్రూర్‌: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై సందీప్‌ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మంత్రి పోశవ్వ మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బోధన్‌లో ఉండే కూతురు దగ్గరకు వెళ్లింది. గురువారం స్వగ్రామానికి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడం బీరువాలో ఉన్న రూ.20వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో బాలికకు గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండాలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి రిషికపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో చిన్నారి మొఖంపై ఇరువైపులా తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి కేకలకు బయటకు వచ్చిన కుటుంబీలు కుక్కను తరిమివేశారు. గాయపడిన బాలికను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా తండాలో పిచ్చికుక్క సంచరిస్తుందని పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని తండా వాసులు పేర్కొంటున్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



వర్ని/ మోపాల్‌: వర్ని పీఎస్‌ పరిధిలోని మల్లారం శివారులో వాహనాల తనిఖీల్లో రూ. 2,20,420 నగదును పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్‌ గురువారం తెలిపారు. ఈ నగదును నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నామని వారు ఎలాంటి ఆధారాలు చూయించకపోవడంతో నగదును సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. మోపాల్‌ మండల కేంద్రంలోని శివారులో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.70వేలు పట్టుకున్నట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు.

పంతుళ్ల వద్దకు క్యూ కడుతున్న అభ్యర్థులు

నిజామాబాద్‌ సిటీ: జిల్లాలో నేటి నుంచి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఎన్నికల్లో తాము విజయం సాధించాలంటే మంచి ముహూర్తాన నామినేషన్‌ వేస్తే విజయం సాధిస్తామని అభ్యర్థులు సెంటిమెంట్‌తో ముహూర్తాన్ని ఎంపిక చేసుకుంటారు. అభ్యర్థి జాతకం ప్రకారం ఏ తేదీన ఏ సమయానికి నామినేషన్లు వేయాలి, మంచి ముహూర్తం ఎప్పుడు, పూజ పునస్కారాలకు అనుకూలమైన రోజు ఏమిటని తెలుసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు. గతంలో గెలిచిన అభ్యర్థులు తాము చూయించుకున్న పురోహితుల వద్దకే క్యూ కడుతున్నారు. నామినేషన్లు వేయడానికి 3, 6, 7, 8, 9 తేదీలు అనుకూలమని బ్రహ్మ శ్రీ జోషి మధుసూదన శర్మ రుగ్వేద ఘనపాటి తెలిపారు.

నామినేషన్‌ వేసే సమయాలు..

తేదీ	గంటల నుంచి	గం.లోపు	తిథి
3న	11.11	3.16	షష్ఠి
6న	10.40	2.16	నవమి
7న	11.00	3.00	దశమి
8న	10.11	3.16	ఏకదశి
9న	10.01	3.16	ద్వాదశి
10న	9.16	2.56	త్రయోదశి

చెరువు నీటి లీకేజీకి మరమ్మతులు





మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్‌..

మోపాల్‌: మండలంలోని మంచిప్ప కొండెం చెరువు నీటి లీకేజీకి సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. చెరువు నీటి వృథాను అరికట్టేదెన్నడో..? అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు గురువారం స్పందించారు. సంచుల్లో ఇసుకను నింపి తూము వద్ద వేసి తాత్కాలికంగా లీకేజీని అరికట్టేందుకు ప్రయత్నించారు. షెటర్లను సరి చేసేందుకు చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో మరమ్మతు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఎప్పటిలాగే నీరు వృథాగా పోతోంది.

తూము షెటర్ల సమస్యే..!

మంచిప్ప కొండెం చెరువు తూము వద్ద లీకేజీకి షెటర్ల సమస్య కారణమని రైతులు, ఇరిగేషన్‌ అధికారులు పేర్కొంటున్నారు. షెటర్లలో సాంకేతిక సమస్య ఉండటంతోనే నీటి లీకేజీ కొనసాగుతోందని తెలిపారు. తాత్కాలికంగా ఇసుక సంచులతో లీకేజీని అరికట్టినా భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు షెటర్లను సరిచేసే టెక్నికల్‌ అధికారుల ద్వారా లీకేజీని సరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రిమినల్‌ కేసులుంటే వివరాలివ్వాలి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌ : నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు తమపై క్రిమినల్‌ కేసులుంటే తప్పనిసరిగా పూర్తివివరాలు పొందుపర్చాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్‌ వెలువడనున్న నేపథ్యంలో ఆయన గురువారం ఒక ప్రకటనలో సూచనలు చేశారు. ఈనెల 3 నుండి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదేరోజు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈనెల 30న పోలింగ్‌, డిసెంబర్‌ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఈనెల 3వ తేదీ నుంచి నుంచి 10వ తేదీలోపు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్‌ అధికారులకు సమర్పించాలన్నారు. జిల్లాలోని మొత్తం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రతి కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లు ఉన్నాయన్నారు. అభ్యర్థులు భారతీయులై ఉండి 25 ఏళ్లు నిండి ఉండాలన్నారు. నామినేషన్‌ పత్రంలోని ప్రతి కాలం తప్పనిసరిగా నింపాల్సి ఉంటుందన్నారు. ఫారం–2 బీలో నామినేషన్‌ పత్రం సమర్పించాలని, జనరల్‌ అభ్యర్థులైతే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ. 5 వేల డిపాజిట్‌ నగదు రూపంలో లేదా చలానా రూపంలో చెల్లించాలని సూచించారు. నామినేషన్‌ పత్రంతో పాటు రూ.10 నాన్‌ జ్యుడీషియల్‌ స్టాంప్‌ పేపర్‌పై ఫారం–26 అఫిడవిట్‌ సమర్పించాలని, క్రిమినల్‌ కేసులు ఉంటే ఆ పూర్తి వివరాలు పొందుపర్చాలన్నారు. అదేవిధంగా ప్రమాణ పత్రాన్ని అందజేయాలన్నారు. నామినేషన్‌ రోజు నుంచే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి ఆ ఖాతా నుంచే ఎన్నికల ఖర్చు నిర్వహించాలని, ఖర్చు వివరాలు సంబంధిత రిటర్నింగ్‌ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్‌ సూచించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	490	64,081
నిఫ్టీ ▲	144	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కిలో)	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.73	101.94
€	యూరో	ఎస్‌బీఐ	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.12	60.98
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్‌ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.


ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒకదశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటో కార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్‌ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్‌ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

మద్దతుకు మించి ధర

- సోయాకు ప్రభుత్వం ప్రకటించిన ధర క్వింటాలుకు రూ. 4,600..
- మార్కెట్‌లో రూ.4,700
- కొనుగోళ్లకు ఉత్సాహం చూపుతున్న వ్యాపారులు
- మహారాష్ట్రలో మన సోయాకు డిమాండ్
- సాలూర సొసైటీలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



సాలూర సొసైటీలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బోధన్: ఈ ఏడాది వానకాలం సీజన్‌లో రైతులు పండించిన సోయాకు మార్కెట్లో ఆశాజనక ధర లభిస్తున్నది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పోలిస్తే స్వల్ప మొత్తంలో ఎక్కువే ఉంది. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.4,600 మద్దతు ధర ప్రకటించగా, మార్కెట్లో రూ.4,700లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు రోజులక్రితం క్వింటాలు ధర రూ.4,400 వరకు ఉంది. మరింత ధర పెరుగుతుందనే ఆశతో రైతులున్నారు. మద్దతు ధరకు మించి మార్కెట్లో ధర పలకడంతో రైతులు వ్యాపారులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అదును చూసి వ్యాపారులు ధర తగ్గించే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ సారి పంట దిగుబడి పడిపోయి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.



సాలూరలో వ్యాపారులు కొనుగోలు చేసిన సోయాను తూకం వేస్తున్న కూలీలు

ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణం, పంటకు వైరస్, తెగుళ్ల కారణంగా 5 నుంచి 6 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఎకరానికి రూ25 నుంచి 30 వేల వరకు సాగుకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 50 వేల ఎకరాల వరకు సోయా సాగుచేయగా ఇందులో అత్యధిక శాతం విస్తీరణం బోధన్ డివిజన్‌లో ఉంది. వారం రోజుల నుంచి బోధన్ ప్రాంతంలో వ్యాపారులు రైతుల నుంచి సోయా కొనుగోళ్లు మొదలు పెట్టారు. డివిజన్‌లోని బోధన్, సాలూర , రెంజల్, కోటగిరి మండలాలకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని నాందెడ్, లాతూర్, ఇతర నగర కేంద్రాల్లోని భారీ ఆయిల్ మిల్లుల యజమానులు మన ప్రాంతంలో చిరువ్యాపారులు, కమీషన్ ఏజెంట్లను నియమించుకుని కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన సోయాను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలో మన సోయాకు మంచి డిమాండ్ ఉందని తెలుస్తోంది. 15 రోజుల క్రితం నుంచే రైతులు పంట నూర్పిళ్లు ప్రారంభించారు. దిగుబడులు రైతుల చేతికొస్తున్నాయి. కానీ ప్రభుత్వం కొనుగోలుకేంద్రాలు ప్రారంభించడంలో ఆలస్యం చేశారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో మార్క్‌ఫెడ్ సోయా కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. కానీ రైతులు వ్యాపారులకే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్లో ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలుంటే మద్దతు ధర కంటే తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం ఉండదనే భరోసా రైతుల్లో వ్యక్తమవుతున్నది.



సాలూర సొసైటీ ఆవరణలో సోయా కుప్ప

మద్దతు ధర అందించేందుకే కొనుగోలు కేంద్రం

రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సోయాకు ప్రభుత్వ మద్దతు ధర రూ. 4,600 ఉంది. మద్దతు ధరకు మించి మార్కెట్లో ధర ఉందని రైతులంటున్నారు.
– బస్వంత్‌రావు పటేల్, సీఈవో, సాలూర సొసైటీ

షకీల్‌ను ఆశీర్వదించి గెలిపించాలి



సాలూరలో ప్రచారం చేస్తున్న ఆయేషా ఫాతిమా

బోధన్: షకీల్‌ను ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా ప్రజలను కోరారు. నిండు మనసుతో ఆదరించి వరుసగా రెండు సార్లు షకీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. గురువారం సాలూర మండల కేంద్రంలో ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు, ప్రజలు నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయేషా పాల్గొన్నారు. పలుచోట్ల మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, సర్పంచ్ భుయ్యన్ చంద్రకళ రాజప్పపటేల్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, డిస్కో సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సీడర్‌తో బహుళ ప్రయోజనాలు



సూపర్ సీడర్ పనితీరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రూర్: యాంత్రీకరణలో భాగంగా నూతనంగా తెచ్చిన సూపర్ సీడర్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ టి అంజయ్య అన్నారు. సూపర్ సీడర్ పని చేసే విధానంపై కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట వ్యర్థాలను కాలబెట్టకుండా సూపర్ సీడర్ ద్వారా ఒకే సారి పంటవ్యర్థాలను కలియదున్నడంతోపాటు విత్తనాలు విత్తడం, తరువాత మట్టి కప్పివేయడం వంటి పనులను ఏకకాలంలో చేయొచ్చని వివరించారు.

అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

- సర్కార్ బడుల్లో సౌకర్యాలు కరువు
- గుదిబండగా సీపీఎస్
- పట్టించుకోని పాలకులు

నిజామాబాద్‌అర్బన్: విద్య వ్యాపారంగా మారిన ఈరోజుల్లో ప్రభుత్వాలు సైతం విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయి. ఒకపక్క ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా వేధిస్తుండగా, మరో పక్క ప్రభుత్వ ఉపాధ్యాయులకు సీపీఎస్ ఒక భూతంగా మారింది. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు మోక్షం లభించక పలువురికి అర్హత ఉన్న పదోన్నతులు అందని ద్రాక్షగా మారాయి. ఇంకోపక్క 2017 ఉత్తర్వులతో కొందరు జూనియర్ ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయి నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రజా ప్రతినిధులు, ఆయా పార్టీలు ఎలాంటి కార్యాచరణ ప్రకటిస్తాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఒకటో తేదీన రాని జీతాలు..

గత రెండేళ్లుగా ప్రతి నెలా 8-15 తేదీల మధ్య జీతం రావడంతో ఈఎంఐలకు, నిత్య అవసరాలకు ఉద్యోగ ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీఏ ఏరియర్స్, పీఆర్సీ బకాయిలు 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల తరుణంలో సకాలంలో జీతాలు, పెండింగ్ బిల్లులు ఇప్పించే ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వాలని కోరుతున్నారు.

సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులు..

ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు. కానీ పాలకుల కఠిన నిర్ణయంతో లక్షల మందికి జీవన భరోసా దూరమైంది. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఉపాధ్యాయులకు ఆగ్రహం కలిగిస్తోంది. ఈ దశలో అన్ని రాజకీయ పార్టీలు సీపీఎస్ రద్దు అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టడానికి ప్రయత్నాలు చేయాలి. ఉపాధ్యాయులు సైతం సీపీఎస్ రద్దు కోసం పోరాటాలు సైతం చేస్తున్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు మోక్షం ఎప్పుడో..

జిల్లాలో 12,000 మంది ఉపాధ్యాయులు ఉండగా అందులో 80 శాతం మంది ఉపాధ్యాయులు పంచాయతీరాజ్ వారే. ఏళ్లుగా పదోన్నతులు లేక ఎస్జీటీ ఉపాధ్యాయులు అదే క్యాడర్లో పదవీ విరమణ పొందుతున్నారు. గత ప్రభుత్వాలు ఏకీకృత సర్వీసులు తెచ్చి ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి విద్యారంగాన్ని పటిష్టపరుస్తామని హామీలు ఇచ్చినా, అవి ఉత్త మాటలుగా మిగిలిపోయాయి. తాత్కాలిక ఉత్తర్వుల ద్వారా బదిలీలు, పదోన్నతులు చేపట్టినా కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఒక శాశ్వత ఎంఈవో మాత్రమే ఉన్నారు. వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బాస్ రాకతో గులాబీ దళంలో జోష్



వేల్పూర్ మాజీ జెడ్పీటీసీ రాజేందర్ రెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న జీవన్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి ప్రశాంత్‌రెడ్డి విజయం కోసం గురువారం వేల్పూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదసభకు గులాబీ బాస్ సీఎం కె.చంద్రశేఖర్ రావు హాజరుకావడం, సభ విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వ్యక్తమవుతుంది. నామినేషన్ల పర్వం ఆరంభం కాకముందే ఎన్నికల ప్రచారం మొదలుకావడం విశేషంగా జనసమీకరణ చేయడంతో గులాబీ శ్రేణులు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2014, 2018 ఎన్నికల సందర్భంలో మోర్తాడ్ వేదికగా కేసీఆర్ ప్రచార సభను నిర్వహించారు. మోర్తాడ్ సభ ప్రాంగణంలో ఆశించినంత జనానికి సౌకర్యాలు ఉండవనే ఉద్దేశంతో ప్రచార సభను వేల్పూర్‌కు మార్చారు. పైసీస్ పార్క్ కోసం సేకరించిన 44 ఎకరాల స్థలంలో ఎన్నికల ప్రచార సభను నిర్వహించడం గమనార్హం. నియోజక వర్గంలోని 8 మండలాలతో పాటు ఇదే నియోజక వర్గంలో ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మానాల నుంచి కూడా జనాలను తరలించారు. జనసమీకరణ కోసం ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను అద్దె తీసుకున్నారు. సభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా పార్టీ శ్రేణులు జాగ్రత్తలు తీసుకున్నాయి. షెడ్యూల్ ప్రకారం కేసీఆర్ గంటన్నర ఆలస్యంగా వచ్చిన ప్రజలు సభా ప్రాంగణంలో ఓపికతో కూర్చొని కళాకారుల నృత్యప్రదర్శనలను తిలకించారు. ఒక పాటకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డిలు డ్యాన్సులు చేయడం ప్రజలను ఓరెత్తించింది. సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





● సీఎం కటౌట్‌ల కోసం పోటీ

బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద యాత్ర ముగిసిన అనంతరం అభిమానులు కొందరు పోటీ పడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోల కటౌట్‌లను బైక్‌లపై తీసుకెళ్లారు. సీఎం సభలో ఎటు చూసినా కేసీఆర్ చిత్రపటాలే కనిపించాయి. అభిమానులు మరింత రెట్టింపు ఉత్సాహంతో జై తెలంగాణ... జై కేసీఆర్ అంటూ నినదించారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్